క్లుప్తంగా

నేడు పేరంటాలమ్మకు శాకంబరీ అలంకరణ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవార్లు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ అలంకరణ నిమిత్తం భక్తులు అందజేసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లతో పేరంటాలమ్మను, ఆలయ ప్రాంగణాన్ని గురువారం సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం నుంచే అమ్మవార్లు శాకంబరీ దేవిగా దర్శనమిస్తారని పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాలని ఆమె కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నున్న(విజయవాడరూరల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని నున్న పంచాయతీ కార్యదర్శి జీటీవీ. రమణ అన్నారు. గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే రోగాలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే వీలుందని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మురుగునీటి పారుదలకు ప్రత్యేక చర్యలు



కంకిపాడు: మురుగునీటి పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కంకిపాడు ఈఓ రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదల కాకపోవడంతో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వ్యర్థాలు, పూడికతీత పనులను గురువారం చేపట్టారు. పనులను ఈఓ రామకృష్ణ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ డ్రెయిన్లలో వ్యర్థాలు పారబోయడం వల్ల మురుగు పారుదల సమస్యగా మారుతుందన్నారు. చెత్త, వ్యర్థాలు చెత్త కుండీల్లోనే వేయాలని సూచించారు.

29న చేపల వేలం

నున్న(విజయవాడరూరల్: నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లయ్య చెరువు, ఎర్ర చెరువుల్లో చేపలను పట్టుకునేందుకు సోమవారం వేలం పాట నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి జీటీవీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 నుంచి 2026–27 వరకు అనగా మూడేళ్లకుగాను వేలం పాట నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 9299995119 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యువతి అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో యువతి అదృశ్యం అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నాగూర్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. అతను కార్పెంటర్ పని చేస్తాడు. అయితే అతని సోదరి కొక్కిలిగడ్డ రమాదేవి(26) అనారోగ్యంతో బాధపడుతోంది. కాగా ఈ నెల 22వ తేదీన ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమె కోసం వెతికినా ఆచూకి తెలియకపోవడంతో సోదరుడు నాగూర్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

గన్నవరం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గన్నవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని బుద్దవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వేల్పూరి నాగయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్న నాగయ్యను కుటుంబ సభ్యులు గమనించి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రాయింగ్ బుక్స్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని ఆర్పీహెచ్ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఆర్పీహెచ్ యువత ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ కాపీ రైటింగ్ బుక్స్, డ్రాయింగ్ బుక్స్ అందించారు. విద్యార్థులకు సాయం చేసిన యువతను ఉపాధ్యాయులు అభినందించారు.

చైర్మన్ పదవి నీదా.. నాదా..!

- పేరంటాలమ్మ ఆలయ నూతన కమిటీకి కసరత్తు
- టీడీపీలో రెండు వర్గాలు పోటీ
- ఎవరి పందాలో వారి ప్రయత్నాలు
- ఆగస్టులో నోటిఫికేషన్ నెలాఖరుకు ఏర్పాటు కానున్న కమిటీ
- ఎమ్మెల్యే యార్లగడ్డ వద్దకు చేరిన పంచాయతీ



రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభమైంది. టీడీపీలో రెండు వర్గాలుగా విడిపోయి ఆలయ చైర్మన్ పదవి కోసం ఎవ్వరి ప్రయత్నాలు వారు చేస్తుండటం గ్రామంలో హట్‌టాపిక్‌గా మారింది. ఉభయ జిల్లాలో పేరంటాలమ్మ ఆలయానికి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఈ ఆలయ చైర్మన్ పదవి కూడా అంతే ప్రతిష్టాత్మకమైంది. ప్రతి సంవత్సరం ఆలయంలో సంక్రాంతి, దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి సంవత్సరం ఆలయ ధర్మకర్తల మండలి పాలకవర్గం ముందుండి నడిపిస్తుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ధర్మకర్తల మండలి చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తాజాగా తన పదవీకి రాజీనామా చేయడంతో ప్రస్తుతం ఆలయానికి ఎవరు చైర్మన్ అవుతారన్న ఆశక్తి అందరిలో నెలకొంది. 150 సంవత్సరాల చరిత్ర ఉన్న పేరంటాలమ్మ ఆలయం 1998లో దేవదాయశాఖ ఆధీనంలోకి వెళ్లింది. గ్రామానికి చెందిన మహిళ తాళ్లూరి ఇందిరా కుమారి 1999లో తొలి ఆలయ చైర్మన్‌గా విధులు నిర్వహించారు. అప్పటి నుంచి రెండేళ్లకు ఒకసారి చైర్మన్‌ను ఎన్నుకుంటూ ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు.

అందరిచూపు చైర్మన్ పదవిపైనే..

గత ధర్మకర్తల మండలి రాజీనామా చేయడంతో ప్రస్తుతం ఆలయ చైర్మన్ పదవి కోసం ఎవరి పందాలో వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ చైర్మన్ రేసులో గ్రామానికి చెందిన మత్తె రాధాకుమార్, కళ్లపల్లి సాయిరామరాజు, తంబాబత్తుల క్రాంతికుమార్‌ల పేర్లు జోరుగా ప్రచారం జరుగుతున్నాయి. గ్రామంలో టీడీపీలో రెండు వర్గాలు ఉండగా ఎవ్వరి వర్గం వారు చైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఓ వర్గంలోని మత్తె రాధాకుమార్ తండ్రి మత్తె వెంకటేశ్వరరావు గతంలో ఆలయానికి చైర్మన్‌గా పనిచేశారు. రాధాకుమార్ కూడా 2012 నుంచి 2021 వరకూ ఉత్సవ కమిటీలో పని చేసిన అనుభవం ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకుని చైర్మన్ పదవి అప్పగించాలని వారు వాదిస్తున్నారు. అమ్మవారి వంశస్తులకు ఆలయం దేవదాయశాఖ ఆధీనంలోకి వెళ్లిన తర్వాత ఇప్పటి వరకూ చైర్మన్ పదవి వరించలేదని ఇప్పడైన కళ్లపల్లి సాయిరామరాజుకు అవకాశం ఇవ్వాలని మరో వర్గం వాదిస్తోంది. కాగా కొత్తగా కాల్వకట్ట ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి నాకు చైర్మన్ పదవి ఇవ్వాలంటూ పట్టు పడుతున్నట్లు తెలుస్తుంది. చైర్మన్ పదవికే కాకుండా ఆలయ డైరెక్టర్ల పదవులు కూడా మాకు కావాలంటే మాకు కావాలని టీడీపీ, జనసేన నాయకులు పట్టు పడుతున్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ చుట్టూ ప్రదక్షిణలు

పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ పదవి మాకు కావాలంటే మాకు కావాలని గ్రామ టీడీపీలోని రెండు వర్గాలు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరో రెండు నెలల్లో దసరా పండుగ రానుండటంతో ఆలయానికి నూతన కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. పైగా ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల కానుంది. అదేనెల చివరిలోనే ఆలయ నూతన పాలకవర్గం కూడా ఏర్పాటు కావాల్సి ఉంది. దీంతో టీడీపీకి చెందిన రెండు వర్గాలు చైర్మన్, డైరెక్టర్ల పేర్లతో కూడిన జాబితాను రూపొందించే పనిలో పడ్డారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులపై టీడీపీ వేధింపులు



విచారిస్తున్న డీవైఈఓ పద్మారాణి

గన్నవరం: నియోజకవర్గంలో టీడీపీ నేతల వేధింపుల పర్వం కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే అనుమానంతో విద్యాశాఖలో పనిచేస్తున్న పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులపై ఫిర్యాదులు చేశారు. వారిని తక్షణం విధుల నుంచి తప్పించాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచారు. వివరాలీలా ఉన్నాయి. గన్నవరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్, బండ్లమూడి ఆంజనేయప్రసాద్‌తో పాటు సీఆర్పీ కాండ్రు మోహన్‌రావుపై ఉన్నతాధికారులకు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ కోసం డివైఈఓ పద్మారాణి గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయానికి విచ్చేశారు. టీడీపీ నేతలు చేసిన ఆరోపణలపై వివరణ కోరుతూ ముందుగా సిద్ధం చేసి తీసుకువచ్చిన ప్రశ్నావళి పత్రాలను ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్పీలకు అందజేసి వారి నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. మరో నలుగురు సీఆర్పీల నుంచి కూడా ఉద్యోగ బాధ్యతల నిర్వాహణపై లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. విచారణ విషయం ముందుగానే తెలుసుకున్న టీడీపీ నేతలు టీ శ్రీనివాసరావు, ఎం నాగబాబు తదితరులు కార్యాలయానికి చేరుకుని సదరు ఉద్యోగులపై ఆరోపణలతో కూడిన మరో ఫిర్యాదును కూడా అందజేశారు. సదరు ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నట్లుగా డీవైఈఓ తెలిపారు. ఎంఈఓ–1 కె. రవికుమార్, ఎంఈఓ–2 కమల పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో దొండ సాగు లాభదాయకం



చిన ఓగిరాలలో తోటబడి కార్యక్రమంలో అధికారులు, రైతులు

ఉయ్యూరు: మేలైన యాజమాన్య పద్ధతులతో దొండ సాగును లాభదాయకంగా మార్చుకోవచ్చని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం (విజయవాడ) అధికారి డాక్టర్ ప్రేమ్ రంజిత అన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో దొండ సాగుపై తోటబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. దొండ సాగు, వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రేమ్ రంజిత మాట్లాడుతూ తోటబడితో దొండ, ఇతర వాణిజ్య పంటల సాగులో మెళుకువలపై అవగాహన పెంపొందుతుందన్నారు. తద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ఆస్కారం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణ కేంద్రం ప్రతినిధులు వీరబాబు, సురేష్, ఉద్యానశాఖ అధికారి దేవీశ్రీ, ఏఈఓ సునీల్ గవాస్కర్, రైతులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన యూనియన్ కార్యవర్గం

గన్నవరం: స్థానిక చింతపల్లి పాపారావు భవనంలో గురువారం ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ గన్నవరం ఆర్టీసీ డిపో శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షుడిగా బీ సంజీవరావు, కార్యదర్శిగా టీవీ కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంప్లాయిస్ యూనియన్ పనిచేస్తుందన్నారు. యూనియన్ బలోపేతానికి కార్మికులందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. తొలుత ఇతర యూనియన్ల నుంచి ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిన కార్మికులకు స్వాగతం పలికారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏజె. రత్నాకర్ అధ్యక్షన జరిగిన సభలో జోనల్ కార్యదర్శి వైఎస్. రావు, రీజనల్ కార్యదర్శి వైవి. రావు, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు, ప్రసాదంపాడు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ఎనికేపాడు ఏలూరు కాల్వకట్ట ప్రాంతం, ప్రసాదంపాడు ఓవెల్ కిడ్స్ పాఠశాల ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంకిపాడు-గన్నవరం రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కంకిపాడు: ప్రయాణికుల రాకపోకల సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జేసీఎస్ మాజీ చైర్మన్, కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. పునాదిపాడు అండర్‌పాస్ వద్ద కంకిపాడు–గన్నవరం రోడ్డు గోతులమయంగా మారి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మతులను చేపట్టారు. రోడ్డు మరమ్మతు పనులను గురువారం రాచూరి చిరంజీవి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోతుల కారణంగా వర్షం పడితే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రహదారి మరమ్మతులు చేపట్టామని వివరించారు. స్థానిక నాయకులు బాకీ రాజు, కంకిపాటి రమేష్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు సద్వినియోగం చేసుకోవాలి



నెప్పల్లిలో ఆధార్ నమోదు

కంకిపాడు: ఆధార్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ కోరారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్, కంకిపాడు పంచాయతీ, పునాదిపాడు శ్రీచైతన్య జూనియర్ కాలేజ్, నెప్పల్లి సచివాలయంలో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించారు. మూడో రోజు ప్రత్యేక శిబిరంలో 79 మంది లబ్ధిదారులు ఆధార్ నమోదు చేయించుకున్నారు. శిబిరాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిబిరాలతో ఆధార్ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు.

ముస్తాబాదలో 104 వాహన వైద్య సేవలు

గన్నవరం రూరల్: రోగులు నిరంతరం ప్రభుత్వం అందించే వైద్యాన్ని వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి శ్రీహర్ష పేర్కొన్నారు. ముస్తాబాద సచివాలయంలో 104 వాహన వైద్య సేవల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. దీర్ఘకాల రోగాలకు క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలన్నారు. ఆహార మార్పుల ద్వారా రోగాలకు దూరంగా ఉండటం సాధ్యమని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల చెంతకు తప్పిపోయిన బాలుడు



తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

రామవరప్పాడు: మతిస్థిమితం లేని బాలుడు ఆడుకుంటూ తప్పిపోయి పోలీసుల చొరవతో కుటుంబ సభ్యుల చెంతకు చేరిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామవరప్పాడు రాజుల బజారుకు చెందిన యాసం రాఘవేంద్రకు కుమార్తె, కుమారుడు సంతానం. కుమారుడు రుషి (11)కి మతిస్థిమితం సరిగ్గా ఉండదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో రుషి ఒంటిపై దుస్తులు లేకుండా ఇంట్లో నుంచి బయటకు వచ్చేశాడు. గ్రామంలోని బల్లెంవారి వీధిలో తిరుగుతుండగా స్థానికులు గమనించి వివరాలు అడగ్గా బాలుడు చెప్పలేకపోయాడు. అటుగా వెళ్తున్న పోలీసులకు బాలుడిని అప్పగించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు పరిసర ప్రాంతాల్లో బాలుడి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నం మొదలుపెట్టారు. ఇదే సమయంలో తప్పిపోయిన బాలుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అక్కడ కుటుంబసభ్యులు రిషిని గుర్తించడంతో పోలీసులు వారికి అప్పగించారు. తప్పిపోయిన బాలుడిని తమ చెంతకు చేర్చడంలో సహకరించిన పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

బహుముఖ ప్రతిభాశాలి దాశరథి



దాశరథి శత జయంతి సభలో నారాయణరావు, చిట్టిబాబు తదితరులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి కవి, పండితుడు దాశరథి కృష్ణా మాచారి అని కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, తెలుగు కళావాహిని, తెలుగు కళావాహిని, శ్రీ కళా భారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం దాశరథి శత జయంతి వేడుకలను నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట సమయంలో దాశరథి కీలకంగా పని చేసినట్లు గుర్తు చేశారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ దాశరథి లలిత గీతాలతోపాటు, వందల సినిమాలలో పాటలు రచించినట్లు తెలిపారు. సాహితీవేత్తలు డాక్టర్ కమ్మిలి శేషుకుమార్, డాక్టర్ రామతీర్థ, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు దాశరథి సాహితీసేవలను వివరించారు. కోట వెంకటేశ్వరరెడ్డి, మల్లాది స్వాతి, షబానా, శ్రావణి, మల్లీశ్వరి, రజని, మోహన కృష్ణ, దాశరథి రచించిన సినీ, లలిత గీతాలను ఆలపించారు. అతిథులను, గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

శివరామకృష్ణక్షేత్రంలో ఆధ్యాత్మిక ప్రసంగం

విజయవాడ కల్చరల్: సనాతన ధర్మరక్షకు శృంగేరీ శారదా పీఠం కట్టుబడి ఉందని ఆధ్యాత్మికవేత్త విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అన్నారు. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో అభినవ శంకర విజయం–వివరణాత్మక భాషణం భక్తిగా సాగుతున్నాయి. గురువారం నాటి కార్యక్రమంలో గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ 33వ పీఠాధిపతిగా నృసింహభారతి పీఠాధిపత్యం వహించినట్లు తెలిపారు. ఆదిశంకరుల బోధనలను ప్రపంచానికి చాటిచెప్పినట్లు తెలిపారు. గన్నవరం లలితాదిత్య రచించిన అభినవ శంకర విజయం–వివరణాత్మక భాషణం గ్రంథ విశేషాలను వివరించారు. కార్యక్రమాన్ని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ నిర్వహించారు. గురువందనంతో ప్రసంగం ప్రారంభమైంది.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ఒలింపిక్ క్రీడలపై అవగాహన ర్యాలీ

పెనమలూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశానికి పేరు తీసుకురావాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ .రత్నప్రసాద్ అన్నారు. కాలేజీలో గురువారం 33వ ఒలింపిక్స్ క్రీడలపై అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్స్‌లో రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారని తెలిపారు. వీరు పతకాలు గెలిచి రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టి రాణించి ఖ్యాతి పొందాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏఓ సాయిబాబు, వ్యాయామ అధ్యాపకుడు పోతిన రఘు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

• రహదారి ఛిద్రం.. ప్రయాణం అస్తవ్యస్తం



గోతులతో అధ్వానంగా మారిన ఈడుపుగల్లు–పునాదిపాడు రోడ్డు మార్గం

కంకిపాడు: రహదారి కష్టాలకు ఈడుపుగల్లు–పునాదిపాడు రోడ్డు కేరాఫ్‌గా మారింది. మండలంలోని ఈడుపుగల్లు ప్రధాన గ్రామం నుంచి కంకిపాడు–గన్నవరం రోడ్డు మార్గాన్ని కలుపుతూ పునాదిపాడు వరకూ రహదారి మార్గం ఉంది. కంకిపాడు–గన్నవరం రోడ్డు మార్గానికి వెళ్లేందుకు, రైతాంగం, కూలీలు పంట పొలాలకు వెళ్లేందుకు ఈ మార్గాన్ని అధికంగా వినియోగిస్తుంటారు. అయితే రహదారి ప్రస్తుతం గోతులమయంగా అధ్వానంగా తయారైంది. వ్యవసాయ పనుల సీజన్‌లో దమ్ము ట్రాక్టర్లు ఈ రోడ్డు మార్గాన్ని అస్తవ్యస్తంగా మారుస్తున్నాయి. ఇనుప బద్దె తగిలించకుండా దమ్ము ట్రాక్టర్లను రోడ్డుపై నడపడంతో రోడ్డు ధ్వంసమైంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. భారీ వర్షాలకు గోతుల్లో వర్షపునీరు నిలిచిపోతుంది. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా శిక్షా సప్తాహ వేడుకలు



'సిద్ధార్థ'లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శిక్షా సప్తాహ వేడుకలు పాఠశాల ఆవరణలోని మైదానంలో ఉత్సాహపూరిత వాతావరణంలో గురువారం జరిగాయి. స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. దేశ భక్తి గీతాలాపన, సంప్రదాయ నృత్యాలు చేసి విద్యార్థులు అలరించారు. పాఠశాల ఆవరణలో కొత్త లైబ్రరీని, సైన్స్ లేబొరేటరీని, పాఠశాల అంశాలతో కూడిన మ్యాగజైన్, వార్తాలేఖను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులు వారిలోని ప్రతిభను ప్రదర్శించేందుకు శిక్షా సప్తాహ వేడుకలు మంచి వేదిక అని అన్నారు. తమ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లోని నైపుణ్యాలను పెంపొందించేవిగా ఉన్నాయన్నారు. విద్యార్థుల వారిలో ఉన్న శక్తి సామర్థ్యాలను మరింతగా పెంచేవి విధంగా ఉపాధ్యాయులు నిత్యం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి పొలాలకు సస్యరక్షణ చేపట్టండి

పెనమలూరు: వరి పొలాలకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ అన్నారు. ఆమె గురువారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాల్లో వరి చేలు నీట మునిగాయన్నారు. డ్రైనేజీల్లో నీటి పారుదల లేకపోవడంతోనీరు పంట పొలాల్లోనే ఉండిపోయాయని అన్నారు. మండలంలో దాదాపు 600 ఎకరాలు పూర్తిగా నీట మునిగాయన్నారు. ఇప్పుడు పొలాల్లో నీరు బయటకు వెళ్లినందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. ఎకరా వరి పొలానికి 10 కిలోల యూరియా, 5 కిలోల పొటాస్ చొప్పున వేయాలన్నారు. వరి చేలు దుబ్బు చేయడానికి ఎరువులు ఉపయోగపడతాయన్నారు.